సాక్షి అనంతపురం

బుధవారం ¦ 17 ¦ జనవరి ¦ 2024



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రజాప్రతినిధులు అన్నారు. ఎ.నారాయణపురంలో సంక్రాంతి సంబరాల్లో వారు మాట్లాడారు.

8లో



108లో ప్రసవం

ఆస్పత్రికి తీసుకెళ్తున్న 108 వాహనంలోనే గర్భిణి పండంటి మగబిడ్డను ప్రసవించింది.

8లో

గరిష్టం/కనిష్టం

34.4°/ 19.2°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

గుంతకల్లు డీఆర్‌ఎంగా వినిత్ సింగ్



గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్(డీఆర్ఎం)గా వినిత్ సింగ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసినట్లు డివిజనల్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం డీఆర్‌ఎంగా ఉన్న మనీష్ అగర్వాల్‌ను సెంట్రల్ రైల్వేలోని నాగపూర్ డీఆర్‌ఎంగా బదిలీ చేయగా, ఈస్ట్ కోస్ట్ రైల్వేలోని సంబల్‌పూర్ డీఆర్‌ఎంగా ఉన్న వినిత్‌సింగ్‌ను గుంతకల్లుకు బదిలీ చేసినట్లు వివరించాయి.

నేటితో ముగియనున్న జేఎన్‌టీయూ వీసీ పదవీ కాలం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన పదవీ కాలం బుధవారంతో ముగియనుంది. 2021 జనవరి 18న ఆయన వీసీగా నియమితులయ్యారు. వీసీ పదవీ కాలం మూడు సంవత్సరాలు కావడంతో నేటితో గడువు పూర్తికానుంది. కాగా, నూతన వీసీ నియామకానికి సంబంధించిన సెర్చ్ కమిటీ (అన్వేషణ) నియామకం అయ్యింది. ఈ కమిటీ ఇప్పటికే సమావేశమై నూతన వీసీ కోసం దరఖాస్తులను పరిశీలించి ముగ్గురి పేర్లను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇందులో ఒకరిని గవర్నర్ సిఫార్సుతో వీసీగా నియమిస్తారు. త్వరలోనే వీసీ నియామక ప్రక్రియ పూర్తి కానుంది.

- అటు ఎస్కేయూనివర్సిటీలో గతేడాది నవంబర్ 21 నుంచి నూతన వీసీని నియమించలేదు. దీంతో ఇక్కడ ఇన్‌చార్జ్ వీసీని నియమించారు. ఈ నేపథ్యంలో ఒకే దఫా రెండు యూనివర్సిటీలకూ నూతన వీసీల నియామకం చేయనున్నారు.

20న 'నవోదయ' పరీక్ష

- ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,857 మంది హాజరు
- 34 కేంద్రాల ఏర్పాటు, వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు



లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశానికి (2024–25 విద్యా సంవత్సరానికి) ఈనెల 20వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. లేపాక్షి జవహర్ నవోదయ పాఠశాలలో మొత్తం 80 సీట్లు ఉండగా, ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,857 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో 34 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబర్, పాస్‌వర్డ్, పుట్టిన తేదీ వివరాలు ఉపయోగించి అడ్మిట్ కార్డులు వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. 18వ తేదీ అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో సెంటర్ సూపరింటెండెంట్లకు (సీఎస్), సెంటర్ లెవెల్ అబ్జర్వర్లు (సీఎల్‌ఓ)లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9573287480, 9493832164, 8412054394, 9485235387 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: ఉభయ జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశం ఎట్టకేలకు బుధవారం నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన ప్రారంభం కానుంది. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ, చరణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీటీసీ, కో–ఆప్షన్ సభ్యులు హాజరు కానున్నారు. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాలు, తీసుకున్న చర్యలకు సంబంధించి సమగ్ర వివరాలతో అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని జెడ్పీ అధికారులు సమాచారమిచ్చారు.

ఆసక్తికరంగా కొత్త సీఈఓ చేరిక

జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి సస్పెన్షన్ అయ్యాక.. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తాజాగా రెగ్యులర్ సీఈఓగా శిక్షణ పూర్తి చేసుకున్న ఐఏఎస్ వైఖోమ్ నిది యాదేవిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఆమె అనంతపురానికి చేరుకొని ఇక్కడి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఉంటున్నారు. కలెక్టర్ గౌతమిని కలిశారు. అయితే బాధ్యతలు మాత్రం చేపట్టలేదు. ఈ విషయం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఆమె బుధవారమైనా బాధ్యతలు తీసుకుంటారో లేదో అనే అంశం అందరిలో ఆసక్తికరంగా మారింది.

నాసిన్ తలమానికం

- ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది
- ప్రారంభోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ
- హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ప్రముఖులు



లేపాక్షి ఆలయంలో తోలుబొమ్మల ప్రదర్శన తిలకిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ



నాసిన్ వేదికపై ప్రధాని మోదీకి జ్ఞాపిక అందజేస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, చిత్రంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం వైఎస్ జగన్



లేపాక్షి ఆలయం వద్ద ప్రజలకు ప్రధాని అభివాదం

సాక్షి, పుట్టపర్తి : గోరంట్ల మండలం పాల సముద్రం వద్ద ఏర్పాటైన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) జిల్లాకే తలమానికంగా నిలుస్తుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. మంగళవారం ఆయన నాసిన్ కొత్త క్యాంపస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ జిల్లా ఖ్యాతిని కొనియాడారు. 'పుట్టపర్తి సత్యసాయిబాబా, స్వాతంత్య్ర సమరయోధుడు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు, ప్రఖ్యాత తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు ఈ ప్రాంతవాసులు కావడం గర్వకారణం. విజయనగర సామ్రాజ్య సుపరిపాలనకు మూలాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి' అంటూ కీర్తించారు. ఈ ప్రాంతంలో నాసిన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక నాసిన్ ఏర్పాటుకు తోడ్పాటునందించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సందీప్ మల్హోత్ర, సీబీఐసీ చైర్మన్ సందీప్ కుమార్ వర్మ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీ గోరంట్ల మాధవ్, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, నాసిన్ అధికారులు పాల్గొన్నారు.

ఘన స్వాగతం

నాసిన్ ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి పుట్టపర్తి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. మంగళవారం మధ్యాహ్నం 12.50 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్న ప్రధాని మోదీకి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు గోరంట్ల మాధవ్, రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (ఎక్సైజ్, రెవెన్యూ) డాక్టర్ రజత్ భార్గవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్, అడిషనల్ డీజీ శంకరబ్రత బాగ్చీ, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మి రెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, ఆర్డీఓ భాగ్యరేఖ, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, పార్థసారథి, గుడిసె దేవానంద్, శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్‌జే రత్నాకర్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1:03 గంటలకు మోదీ ప్రత్యేక హెలికాప్టర్‌లో లేపాక్షికి వెళ్లారు. అక్కడి నుంచి నాసిన్‌కు వెళ్లి సాయంత్రం 6 గంటలకు తిరిగి పుట్టపర్తి ఎయిర్ పోర్ట్‌కు చేరుకుని ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.

లేపాక్షి శిల్పకళలు అద్భుతం

మధ్యాహ్నం 1.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా లేపాక్షిలోని హెలిప్యాడ్‌కు చేరుకున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ.. లేపాక్షిలోని పాపనాశేశ్వర, వీరభద్ర స్వామి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మోదీ లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ విశిష్టత గురించి గైడ్లు ప్రధానికి వివరించారు. శిల్ప కళా సంపదను చూసి ప్రధాని మైమరచిపోయారు.



రూపుదిద్దుకున్న నాసిన్ అకాడమీ భవనం



సభలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యే శంకరనారాయణ, సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు



ఐఆర్‌ఎస్ ట్రెయినీ ఆఫీసర్లతో ప్రధాని మోదీ, సీఎం జగన్, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్



ప్రధాని మోదీ, గవర్నర్ నజీర్, సీఎం జగన్‌కు పరికరాల గురించి వివరిస్తున్న అధికారి

తొలి విడత తహసీల్దార్ల బదిలీ

అనంతపురం అర్బన్: ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ల బదిలీ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జోన్–4 పరిధిలోని జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ కార్యాలయాల్లో పనిచేసే తహసీల్దార్లను అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఏఆర్‌ఓలుగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులను సీసీఎల్‌ఏ ఏఎండీ ఇంతియాజ్ మంగళవారం జారీ చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వారిని ఇతర జిల్లాలకు, అక్కడున్న వారిని అనంతపురం జిల్లాకు బదిలీ చేశారు.

బదిలీలు ఇలా...

తహసీల్దార్	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పద్మావతి	రాయచోటి	ఉరవకొండ
సుధాకర్	నంద్యాల	కళ్యాణదుర్గం
రామాంజిమ్మ	కర్నూలు	రాప్తాడు
వి.శ్రీనివాసులు	కర్నూలు	రామగిరి
టీజీమోహనవల్లి	చిత్తూరు	యాడికి
ఎ.వెంకటేశ్వర్లు	కర్నూలు	మడకశిర
ఇ.ప్రతాపరెడ్డి	వైఎస్సార్ జిల్లా	గుడిబండ
పి.భారతి	వైఎస్సార్ జిల్లా	పుట్టపర్తి
నాగభూషణం	అన్నమయ్య జిల్లా	ధర్మవరం
వై.భూషణం	గుంతకల్లు	చాపాడు
బి.పుణ్యవతి	అనంతపురం	టి.సుండుపల్లి
ఎ.శ్రీనివాసులు	శ్రీసత్యసాయి జిల్లా	పుల్లంపేట
టి.ఆనంద్‌కుమార్	శ్రీసత్యసాయి జిల్లా	రామాపురం
ఆర్.బాలాజీరాజు	అనంతపురం	కలకడ
ఖతిజన్‌కుబ్రా	పుట్టపర్తి	వాయల్పాడు
అలెగ్జాండర్	అనంతపురం	కౌతాళం

తిరుగు పయనానికి ఆర్టీసీ సన్నద్ధం

- ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సుల నిర్వహణ
- అన్ని డిపోల నుంచి ముఖ్య పట్టణాలకు 84 బస్సులు
- మూడు రోజుల పాటు నడవనున్న ప్రత్యేక సర్వీసులు



అనంతపురం సెంట్రల్: సంక్రాంతి పండుగ పూర్తయింది. పట్టణ, నగర ప్రాంతాల నుంచి పల్లెలకు వచ్చిన వారు భోగి, సంక్రాంతి, కనుమ సంబరాలు పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణమవుతున్నారు. ఎక్కువ శాతం మంది ఆర్టీసీపైనే ఆధారపడుతుండడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ డిపోల నుంచి అన్ని ముఖ్య పట్టణాలకు బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా సర్వీసులను పెంచుతున్నారు. మంగళవారం ప్రయాణికుల రద్దీ ఎక్కువ ఉండడంతో జిల్లా నుంచి మొత్తం 31 బస్సులు వివిధ పట్టణాలకు నడిపారు. అనంతపురం డిపో నుంచి హైదరాబాద్‌కు 2, బెంగళూరుకు 5, గుత్తి నుంచి హైదరాబాద్‌కు 1, బెంగళూరుకు 1, గుంతకల్లు నుంచి బెంగళూరుకు 2, కళ్యాణదుర్గం నుంచి బెంగుళూరుకు 1, రాయదుర్గం నుంచి హైదరాబాద్‌కు 1, బెంగళూరుకు 1, తాడిపత్రి నుంచి హైదరాబాద్‌కు 5, బెంగళూరుకు 6, ఉరవకొండ నుంచి హైదరాబాద్‌కు 1, బెంగళూరుకు 2 సర్వీసులు నడిపారు. రెగ్యులర్ సర్వీసులతో పాటు అదనంగా ఈ బస్సులను నడిపారు. అలాగే వివిధ డిపోల నుంచి చెన్నై, నెల్లూరు, విజయవాడ సర్వీసులు నడిచాయి.

మూడు రోజులకు ప్రణాళిక

సంక్రాంతి పండుగ తర్వాత మూడు రోజుల పాటు ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుందని అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగా బస్సులను సిద్ధం చేసుకోవడంలో భాగంగా ప్రణాళిక రూపొందించారు. వివిధ పట్టణాలకు అనంతపురం డిపో నుంచి 28, గుంతకల్లు నుంచి 6, కళ్యాణదుర్గం నుంచి 10, రాయదుర్గం నుంచి 6, తాడిపత్రి నుంచి 23, ఉరవకొండ నుంచి 11 బస్సులను ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, తిరుపతి, నెల్లూరు, బెంగళూరు పట్టణాలకు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. ప్రయాణికుల రద్దీ ఉంటే వెంటనే అదనపు బస్సులను సమకూర్చుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన వివరించారు.

అయోధ్య వెళ్లేవారికి రైలు సౌకర్యం



హిందూపురం అర్బన్: అయోధ్య రామయ్యను దర్శించుకునే వారి కోసం ఇండియన్ రైల్వే రైలును అందుబాటులోకి తెచ్చింది. యశ్వంతపూర్–గోరఖ్‌పూర్ మధ్య నడిచే ఈ రైలు (15024) ప్రతి గురువారం బెంగళూరులోని యశ్వంతపూర్ స్టేషన్ నుంచి రాత్రి 11.40 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 7.35 గంటలకు గోరఖ్‌పూర్‌కు చేరుకుంటుంది. ప్రతి గురువారం రాత్రి 11.40 లకు యశ్వంతపూర్ స్టేషన్‌లో బయలు దేరి శుక్రవారం తెల్లవారుజామున 2.35 గంటలకు ధర్మవరం, 3.08 గంటలకు అనంతపురం, శనివారం ఉదయం 6.18 గంటలకు కర్నూలు, 8.38 గంటలకు మహబూబ్‌నగర్, 10.40 గంటలకు కాచీగూడ చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలుదేరి కాజీపేట, నాగపూర్, కాన్పూర్, లక్నో మీదుగా శనివారం సాయంత్రం 4.24 గంటలకు అయోధ్య ధాం స్టేషన్‌కు చేరుకుంటుందని సౌత్ వెస్ట్రన్ రైల్వే అధికారులు తెలిపారు. అక్కడి నుంచి శనివారం రాత్రి 8 గంటలకు గోరఖ్‌పూర్ వెళ్లనుంది. ఇదే రైలు (15023) ప్రతి మంగళవారం ఉదయం 8.50 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయలుదేరి ఖాజీపేట మీదుగా బుధవారం రాత్రి 8 గంటలకు కాచిగూడ, గురువారం తెల్లవారుజాము 4.13 గంటలకు అనంతపురం, 5.15 గంటలకు ధర్మవరం చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలుదేరి ఉదయం 10.30 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందని వివరించారు.

నమో నారసింహా

- వైభవంగా నృసింహుడి పార్వేట ఉత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



అశ్వ వాహనంపై ఊరేగుతున్న ఖాద్రీశుడు



పార్వేట ఉత్సవానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు

కదిరి టౌన్: భక్తుల నారసింహుని నామ స్మరణతో కదిరి కొండ ప్రతిధ్వనించింది. అశ్వవాహనంపై కొలువుదీరిన ఖాద్రీశుని దర్శనంతో భక్తజనం మైమరచిపోయింది. సంక్రాంతి తర్వాత కనుమ రోజు ఆనవాయితీగా నిర్వహించే నృసింహుని పార్వేట ఉత్సవం మంగళవారం వైభవంగా సాగింది.

కమనీయంగా పాలపొంగుల ఉత్సవం

ఉదయం అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుడిని విశేషంగా అలంకరించారు. అనంతరం పల్లకీపై కొలువుదీర్చి భక్తులు గోవింద నామస్మరణ మధ్య తిరువీధుల నుంచి గిరిప్రదక్షిణగా కదిరి కొండకు తీసుకువచ్చారు. అక్కడ కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కాటమరాయునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారు కుమ్మరవాండ్లపల్లి సమీపాన పాలపొంగుల ఉట్టిలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. కొలేపల్లికి చెందిన యాదవ కులస్తులు కొత్తకుండలో తెచ్చిన పాలతో పాలపొంగలి చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

కదిరికొండ..జనసంద్రం

పాలపొంగుల ఉత్సవం తర్వాత ఖాద్రీశున్ని పల్లకీలో కొలువుదీర్చి పార్వేట మండపం వద్దకు తీసుకురాగా, వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రెండు కుందేళ్లను జనం మధ్యకు వదలగా యువకులు ఉత్సాహంగా వాటిని వెంబడించి వాటి శరీర భాగాలను లాక్కున్నారు. పార్వేట ముగియగానే స్వామివారిని రాయచోటి రోడ్డులోని మశానంపేటలోని శమీ మండపానికి తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం శ్రీవారు అశ్వవాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమం ముగియగానే చోర సంవాదం తర్వాత స్వామివారు ఆలయం ప్రవేశం చేశారు. భక్తులకు వైఎస్సార్ సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.



సామూహిక పాలపొంగు ఉత్సవం

క్లుప్తంగా

'108'లో ప్రసవం



శిశువును అందజేస్తున్న ఈఎంటీ రామతులసి

రాయదుర్గం టౌన్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా ఇ 108 అంబులెన్స్‌లోనే ప్రసవించింది. వివరాలు... గుమ్మఘట్ట మండలం రంగచేడు గ్రామానికి చెందిన గర్భిణి సువర్ణమ్మకు మంగళవారం తెల్లవారుజాము 4.30 గంటలకు పురిటి నొప్పులు మొదలయ్యాయి. దీంతో కుటుంబసభ్యుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది సకాలంలో ఆ గ్రామానికి చేరుకుని గర్భిణిని తీసుకుని రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి బయల్దేరారు. మార్గమధ్యంలో రాయంపల్లి వద్దకు చేరుకోగానే నొప్పులు తీవ్రం కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పైలెట్ మహేష్ సాయంతో ఈఎంటీ రామతులసి కాన్పు చేశారు. పండంటి మగబిడ్డకు సువర్ణమ్మ జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి చేర్చారు. తల్లీబిడ్డ ప్రాణాలను కాపాడిన 108 సిబ్బందికి ఈ సందర్భంగా సువర్ణమ్మ భర్త వన్నూరుస్వామి, కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

డీఏఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక



మంజుల



పురుషోత్తం

అనంతపురం ఎడ్యుకేషన్: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీఏఎఫ్) ఉభయ జిల్లాల నూతన కార్యవర్గాలను మంగళవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షురాలిగా మంజుల, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా జార్జ్, డానియల్ విజయ్, దౌలత్ ఖాన్‌తో పాటు మరో నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా కమిటీ అధ్యక్షుడిగా గౌస్‌లాజమ్, ప్రధాన కార్యదర్శిగా మారుతీప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా షర్ఫుద్దీన్, శ్రీనాథ్‌తో పాటు నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులను ఎన్నుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి



హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్



అనంతపురం ఎంపీ రంగయ్య



రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ



ఎమ్మెల్సీ మంగమ్మ



జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

సీఎంకు ఘన స్వాగతం

సాక్షి, పుట్టపర్తి: గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నాసిన్ అకాడమీ ప్రారంభోత్సవానికి మంగళవారం విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. కడప నుంచి హెలికాప్టర్‌లో నేరుగా పాలసముద్రం వద్దకు చేరుకున్న ఆయనకు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు శంకర్‌నారాయణ, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, సిద్ధారెడ్డి, తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్ కుమార్, ఎస్పీ మాధవ్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, పెద్దారెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- ఎ.నారాయణపురంలో ఉత్సాహంగా రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి



పోటీలను తిలకించేందుకు హాజరైన ప్రజలు

అనంతపురం రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎంపీ తలారి రంగయ్య, అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎ.నారాయణపురంలో సోమ, మంగళవారాల్లో రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు, గుర్రపు స్వారీ పోటీలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత, పెద్దారెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతి అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ముగింటకే పాలన తీసుకొచ్చారన్నారు. గతంలో నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. చంద్రబాబు హయాంలో పంటలకు కనీస మద్దతు ధర కూడా దక్కలేదన్నారు. రైతు భరోసా కేంద్రా ద్వారా నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు అందుబాటులో ఉంచడంతో పాటు దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరతో పంట దిగుబడులు కొనుగోలు చేస్తోందన్నారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన సంక్రాంతి వేడుకను నగర వాసులు సంబరంగా చేసుకునేలా ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏటా ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఉత్కంఠగా రాతి దూలం లాగుడు పోటీలు

సోమవారం నిర్వహించిన న్యూ కేటగిరి వృషభాల దూలం లాగుడు పోటీల్లో 22 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఉత్కంఠగా సాగిన ఈ పోటీల్లో మామిళ్ల సుబ్బారెడ్డి, భరత్‌కుమార్ వృషభాలు మొదటి స్థానంలో నిలిచాయి, రెండో స్థానంలో నంద్యాల జిల్లా కొత్తూరు నివాసి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డికి చెందిన బీరం బుల్స్ నిలిచాయి. మూడో స్థానాన్ని రామన్న, సాంబ వృషభాలు దక్కించుకున్నాయి. విజేతలకు మంగళవారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రీజనల్ కోఆర్డినేటర్ రమేష్‌గౌడ్, నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అనంత చంద్రారెడ్డి, అనంత లిఖిత్‌రెడ్డి, ఉమ్మడి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గుర్రం పందెంలో దూసుకెళుతున్న జాకీలు

వైఎస్సార్‌సీపీదే అధికారం



మాట్లాడుతున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి (చిత్రంలో) పైలా నరసింహయ్య, హరీష్‌కుమార్ యాదవ్, తదితరులు

తెలుగుదేశం, జనసేనతో పాటు ఎన్ని పార్టీలు జతకట్టినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే అధికారమని శ్యాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక వైపు ఉంటే కేవలం అధికారం కోసం కుట్రలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులు మరో వైపు ఉన్నారన్నారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాతనే చంద్రబాబు మోసాలు, స్కామ్‌లు బయటపడుతున్నాయన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలు, మోసాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాబోవు ఎన్నకల్లో కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయమన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ అంటున్న చంద్రబాబు నలుగురు ష్యూరిటీ లేనిదే జైలు నుంచి బయటకు రాలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలకు ఆయన ఎలాంటి ష్యూరిటీ ఇస్తారన్నారు. తన తల్లిని చంద్రబాబు, లోకేష్ అవమానించారని చెబుతూ ఒకప్పుడు రాష్ట్రమంతా తిరిగిన పవన్‌కళ్యాణ్ నేడు వారితోనే జతకట్టడం సిగ్గుచేటన్నారు. ఎన్నికలకు రెండు నెలలే సమయం ఉందని కార్యకర్తలు, నాయకుల సమష్టి కృషితో 2024లో మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు.

యువజన అవార్డు అందుకున్న భరత్



భరత్‌ను అభినందిస్తున్న కేంద్ర మంత్రి నిసిత్ ప్రమాణిక్

అనంతపురం కల్చరల్: భారతదేశ అత్యున్నత జాతీయ యువ పురస్కారాన్ని నగరానికి చెందిన బిసాటి భరత్ అందుకున్నారు. సోమవారం మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన 27వ జాతీయ యువజనోత్సవాల్లో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి నిసిత్ ప్రమాణిక్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న భరత్‌ను సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, సాహిత్య భారతి అధ్యక్షుడు గుత్తా హరి, తోట నాగరాజు తదితరులు వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న విక్టర్ ప్రసాద్

అనంతపురం టవర్‌క్లాక్: ఈ నెల 19న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.400 కోట్ల వ్యయంతో విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుష్మిత, సోషల్ వెల్ఫేర్ జేడీ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఉరవకొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన మిషన్ రామన్న(48) అనంతపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన సమీప బంధువును పలకరించేందుకు మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఉరవకొండ మండలం కోనాపురం సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రామన్న అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా ఉడాయించాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ పాల్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అరటి తోట దగ్ధం

కూడేరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి అరటి తోట దగ్ధమైంది. వివరాలు... కూడేరు మండలం గొటుకూరుకు చెందిన హనుమంతరెడ్డి, లక్ష్మీరెడ్డి తమకున్న పొలంలో అరటి తోటలను అభివృద్ధి చేశారు. మంగళవారం ఉదయం తోటల మీదుగా వెళుతున్న 11కేవీ విద్యుత్ లైన్ తీగ తెగి కిందపడడంతో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు చెలరేగాయి. పొలం పనులు చేసుకుంటున్న సమీపంలోని రైతులు విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో లైన్‌మెన్ వెంటనే విద్యుత్ సరఫరా ఆపేశారు. మంటలను అదుపు చేసే లోపు హనుమంతరెడ్డి తోటలో 70 చెట్లు, లక్ష్మీ రెడ్డి తోటలో 50 చెట్లు కాలిపోయాయి. రెండు తోటల్లోనూ రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం.

రాష్ట్ర స్థాయి పోటీలకు కబడ్డీ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన బాలబాలికల జట్లు

గుంతకల్లు: ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకూ నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా బాలబాలికల జట్టు ఎంపిక మంగళవారం గుంతకల్లులో చేపట్టారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో ఈ నెల 15న చేపట్టిన ఈ ప్రక్రియకు ఉమ్మడి జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర విభాగంలో గుంతకల్లుకు చెందిన కుసులన్న, జమన్న, బి.సునీల్, యు.వంశీ, పులగుట్టపల్లికి చెందిన పి.సోము, అనంతపురానికి చెందిన నాగశేఖరరెడ్డి, వెంకటసాయి, తిమ్మాపురం నుంచి సునీల్, తాడిపత్రి నుంచి ఎం.అనిల్, కొనకొండ్ల నుంచి గోపీకృష్ణ, పామిడి నివాసి కె.అనిల్, రాయలచెరువుకు చెందిన ఎం.నవీన్, స్టాండ్‌బై కింద పి.ఆనంద్, సి.వంశీ, జి.నాగార్జున, ఎం.వీరన్న ఎంపికయ్యారు. బాలికల జట్టులో గుంతకల్లుకు చెందిన జ్యోతి, రేవతి, షకీల, నందిని (బత్తలపల్లి) ఆయేషా, మేజిబా, జయశ్రీ (అనంతపురం), ప్రియాంక, సాగరిక (ధర్మవరం), నవ్య (తాడిపత్రి), సి.ప్రణవి, ప్రమీల (నెలగొండ), స్టాండ్ బై కింద సి.నందని (అనంతపురం), అర్చన (తాడిపత్రి) చోటు దక్కించుకున్నారు. కార్యక్రమాన్ని జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ్, వైఎస్సార్‌సీపీ గుంతకల్లు మండల కన్వీనర్ బి.మోహనరావు, పీడీ సత్యనారాయణ, ఓబులేసు తదితరులు పర్యవేక్షించారు.

జంతువుల దాడిలో యాచకుడి మృతి

గుంతకల్లు రూరల్: అడవి జంతువుల దాడిలో ఓ యాచకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పాతకొత్తచెరువు గ్రామంలోని దర్గా-నక్కనదొడ్డి దర్గాల వద్ద యాచన చేస్తూ జీవిస్తున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆదివారం రాత్రి గుంతకల్లు వైపు నడుచుకుంటూ వస్తుండగా గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి సమీపంలో అడవి జంతువులు దాడి చేసి, చంపేశాయి. ముఖాన్ని పీక్కు తిన్నాయి. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనా స్థలిలో లభ్యమైన ఆధారాలను బట్టి ఎలాంటి రోడ్డు ప్రమాదం చోటు చేసుకోలేదని, జంతువుల దాడిలోనే యాచకుడు మృతిచెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

• మాకూ చదువుకోవాలని ఉంది



ముఖానికి రంగులు అద్దుకుంటున్న చిన్నారులు

పెనుకొండ రూరల్: చదువుకోవాల్సిన వయసులో చేతులు చాచి భిక్షమెత్తుకుంటున్నారు. చిరు ప్రాయంలోనే కుటుంబ పోషణ భారాన్ని పంచుకుని ముఖానికి రంగులు అద్దుకున్నారు. చిన్నారుల కష్టాన్ని గమనించి 'సాక్షి' పలకరిస్తే ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. అనంతపురంలోని బిందెల కాలనీకి చెందిన అరుణ్ పదో తరగతి వరకూ చదువుకున్నాడు. ఈ క్రమంలో కుటుంబపోషణ భారంగా మారడంతో తన చెల్లెలు గౌతమితో కలసి పెనుకొండ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఆంజనేయస్వామి వేషధారణతో భిక్షమెత్తుకోవడం మొదలు పెట్టాడు. తన తండ్రి సైకిల్‌పై దుస్తుల వ్యాపారం చేస్తుంటాడని, కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున చదువు కొనసాగించలేక దేవుడి వేషం కట్టి భిక్షమెత్తుకుంటున్నట్లు అరుణ్ వివరించాడు. అందరిలా చదువుకోవాలని తమకూ ఉందని, అయితే పూటగడవని స్థితిలో ఇలా పగటి వేషం కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. దాతలు సహకరిస్తే చదువును కొనసాగించి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఉందని పేర్కొన్నాడు.



రహదారుల వెంబడి యాచనకు సిద్ధమైన దృశ్యం

క్లుప్తంగా

బైరెడ్డికి ఎమ్మెల్యే తేనీటి విందు



ఎమ్మెల్యేను కలిసిన ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తేనీటి విందు ఇచ్చారు. సోమవారం ఏ నారాయణపురంలో జరిగిన రాతిదూలం లాగుడు పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన..అనంతరం ఎమ్మెల్యే అనంత నివాసానికి వెళ్లారు.

వైభవంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట

రాప్తాడు: మరూరు ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. తెల్లవారుజామున 1.30 గంటల నుంచి 2 గంటలలోపు వేదపండితులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, కలశపూజ, సప్తశతీపారాయణం, ప్రతిష్ఠాహోమాలు, కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, జ్వాలాదర్శనం, గోదర్శనం నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా పెద్దమ్మ దేవర..

మండలంలోని మరూరులో ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో పెద్దమ్మ దేవరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జామునే వేదపండితులు అమ్మవారికి అభిషేకాలు,అర్చనలు, ప్రత్యేక పూజలతో కార్యక్రమాలను మంత్రోచ్చారణలతో నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజులు పూర్తి కావడంతో గ్రామంలో పెద్దమ్మ జాతర నిర్వహించారు. జాతరకు వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావడంతో మరూరు జనసంద్రమైంది.

విప్లవ యోధుడు లెనిన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం అర్బన్: విప్లవ యోధుడు లెనిన్ అని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ కొనియాడారు. ఈనెల 21న లెనిన్ శత వర్ధంతిని పురస్కరించుకొని కార్మిక వర్గానికి ఆయన అందించిన సేవలు, సోషలిజం ప్రాధాన్యతలను సీపీఎం ప్రచురించిన పుస్తకాన్ని నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో సాకే బాబు సత్తా



సాకే బాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

అనంతపురం రూరల్: ఇటీవల గోవాలో నిర్వహించిన 22వ జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్(ఎఫ్-56)లో అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన సాకేబాబు సత్తాచాటాడు. మంగళవారం గ్రామానికి రావడంతో వాల్మీకి సంఘం నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. వాల్మీకి సంఘం నాయకులు మురళీ మాట్లాడుతూ బాబు గోల్డ్‌మెడల్ సాధించడం ఎంతో గర్వకారణమన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దేవదాయశాఖ అధికారులకు చెక్కు అందిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తిలోని రామాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తండ్రి తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి దేవదాయశాఖ అధికారులకు రూ.2 లక్షల చెక్కు మంగళవారం అందించారు.

ఇసుక ట్రాక్టరు సీజ్

యల్లనూరు: శింగవరం గ్రామ సమీపంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును మంగళవారం ఎస్ఐ ధరణీబాబు సీజ్ చేశారు.

22న శోభాయాత్ర

తాడిపత్రి అర్బన్: అయోధ్యలో శ్రీరాముని ప్రతిష్ట మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 22న పట్టణంలో శ్రీరాముడి శోభాయాత్రను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోజు ఉదయం 8 గంటలకు నంద్యాల రోడ్డులోని కోదండరామస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు.

సందడిగా సంప్రదాయ పండుగ



శిల్పారామంలో భోగిమంట చుట్టూ ప్రదర్శన



వేషధారణలో ఎల్కేపీ కళాకారుడు



రాప్తాడులో బొడ్రాయి వద్ద అలంకరణ

అనంతపురం కల్చరల్: నగరంలో ప్రతి ఇంటా సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను మూడురోజుల పాటు సంతోషంగా జరుపుకున్నారు. ఆలయాల్లో నగరవాసులు పూజలు చేశారు. ముఖ్యంగా వైష్ణవాలయాల్లో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలతో పాటు చక్కెర పొంగలి నైవేద్యం చేసి, భక్తులకు వితరణ చేశారు. పాతూరు విరూపాక్షేశ్వరాలయం, ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయం తదితర చోట్ల పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మకర జ్యోతి దర్శనం వేళ మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేకంగా వెలిగించిన జ్యోతుల నడుమ హరిహరసుతుడు పూజలందుకున్నాడు. లలిత కళాపరిషత్తు కళాకారులు వరప్రసాద్, వెంకటేష్ తదితరులు సంక్రాంతి సంప్రదాయాన్ని చాటుతూ గంగిరెద్దుల వేషధారణతో ప్రజలను పలకరించి ఆకట్టుకున్నారు. వినోద విహార కేంద్రాలు కిటకిటలాడాయి.

నగరం నిర్మానుష్యం : సంక్రాంతి పండుగ సందర్భంగా నగరవాసులు పల్లెబాట పట్టడంతో వీధులు నిర్మానుష్యంగా మారాయి. నగరంలో ఎక్కడ చూసిన రోడ్లు ఖాళీగా కనిపించాయి. రోడ్లపై జనం లేక బోసిపోయాయి. నిత్యం ట్రాఫిక్‌తో సందడిగా కనిపించే సప్తగిరి సర్కిల్ వెలవెలబోయింది.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

అనంతపురం రూరల్: స్థానిక శిల్పారామంలో ఏఓ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేయడం పాటు పతంగులు ఎగురవేశారు. క్లాసికల్ డ్యాన్సులు, ఇంద్రజాల ప్రదర్శన, మిమిక్రీతో పాటు పలు సినిమా పాటలకు చిన్నారులు వేసిన డ్యాన్సు చూపరులను ఆకట్టుకున్నాయి.

రాప్తాడు: మండల వ్యాప్తంగా ప్రజలు సంప్రదాయాల పండుగను సందడిగా జరుపుకున్నారు. ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను జరుపుకున్నారు. సోమవారం ఉదయం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని యువకులు, పెద్దలు, మహిళలు నూతన వస్త్రాలు ధరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు, కుర్చీలాట, వంటల తయారీ, చిన్నారులకు భోగి (రేగు) పండ్లు పోయటం, గాలిపటాలు ఎగుర వేయడం, యువకుల కోసం డ్యాన్స్ బేబీ డాన్స్, ఫ్యాషన్ డ్రస్ పోటీలు నిర్వహించారు. యువకులు చినీ కాయలు, నిమ్మకాయలు, టెంకాయలు విసరడంలాంటి పందేలు ఆడారు.

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను సంబరంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఇంటి ముందు ఉదయాన్నే కల్లాపి చల్లి రంగు రంగు ముగ్గులు వేశారు. గుమ్మడి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. చిన్నారులు గాలిపటాలను ఎగర వేస్తూ ఆనందంగా గడిపారు.



శిల్పారామంలో నృత్య ప్రదర్శన



నిర్మానుష్యంగా ఉన్న సుభాష్‌రోడ్డు



శిల్పారామంలో ఆకట్టుకున్న వేషధారణలు

భక్తిశ్రద్ధలతో కనకదాస జయంతి



గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న కురుబలు

ఆత్మకూరు: సిద్దరాంపురం గ్రామంలో భక్తి శ్రద్ధలతో కనకదాస జయంతి వేడుకలు నిర్వహించారు. కనకదాస చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. యువతులు, మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం కనకదాస చిత్ర పటానికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు.

అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

శింగనమల: మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఆదివారం శింగనమలలో అయ్యప్ప స్వామి భక్తులు ఊరేగించారు. అయ్యప్ప స్వామి సన్నిదానంలో జ్యోతి కనిపించిన తరువాత గ్రామంలో అయ్యప్ప భక్తులు ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు ప్రసాదాలు అందించారు. ఊరేగింపులో భక్తులు శివుడు, అయ్యప్ప వేషధారణలో కనిపించారు.

రాతి కట్టడంతో ఆలయాల నిర్మాణానికి కృషి

- దేవదాయ,ధర్మదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్

గార్లదిన్నె: దేవదాయ,ధర్మదాయశాఖ నిధులు మంజూరు చేయించి, రాతి కట్టడంతో ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నట్లు దేవదాయ,ధర్మదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ పేర్కొన్నారు. యర్రగుంట్లలో హిందూ ధర్మాలు పాటించి, రాతి కట్టడాలతో ఆలయాలు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా యర్రగుంట్లలో నిర్మాణంలో ఉన్న రాతి కట్టడాలతో ఆలయాలు నిర్మిస్తుండడంతో నిర్మాణ పనులను జ్వాలాపురం శ్రీకాంత్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలు మరిచిపోతున్న తరుణంలో గ్రామంలో ప్రజలందరూ ఐకమత్యంతో హిందూ మత ధర్మలు పాటించి, ఆంజనేయ స్వామి, శివాలయం,వేణుగోపాలస్వామి ఆలయాలు రాతి కట్టడంతో నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.కోటి వెచ్చించి, ఆలయ నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఆలయ నిర్మాణానికి దేవదాయశాఖ నుంచి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరడంతో గ్రామంలో ఆలయ నిర్మాణ పనులు పరిశీలించామన్నారు. గ్రామంలో హిందూ ధర్మాలు పాటిస్తున్నందున దేవదాయ శాఖ కమిషనర్‌కు వివరించి లేఖ రాశానని, త్వరలో నిధులు మంజూరు చేయించి, ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఆలయాలు అభివృద్ధికి, ఆలయంలో విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతపురంలో దాదాపు 20 దేవాలయాలకు నిధులు మంజూరు కాగా, గార్లదిన్నెలో శిరివరం, రూ.60 లక్షలు, బుక్కరాయ సముద్రంలో రూ.70 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు.

ప్రతి డివిజన్‌లోనూ అభివృద్ధి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: టీడీపీ హయాంలో నగరం అభివృద్ధికి నోచుకోలేదని, కేవలం డివైడర్లకే పరిమితమైందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రతి డివిజన్‌లోనూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మంగళవారం 9,10 డివిజన్లకు సంబంధించి రాణీనగర్ మీనా మసీదు ఎదురుగా ఉన్న ఫెర్రర్ కాలనీలో రూ.29 లక్షల (సీఎం నిధులు)తో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవిడ్‌తో రెండున్నరేళ్ల పాటు గడిచిపోయినా...మిగితా రెండేళ్లలో నగరంలో ప్రాధాన్యతాక్రమంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఒక్కో డివిజన్‌లో రూ.2 కోట్ల చొప్పున అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందన్నారు. తమ ప్రభుత్వంలో కార్మికులు, కూలీలు, పేద వారు నివసిస్తున్న డివిజన్లను అభివృద్ధి చేశామన్నారు.

నగర రూపురేఖలు మార్చేశాం..

అంబేడ్కర్‌నగర్, రాణీనగర్, ఫెర్రర్ కాలనీ, వినాయకనగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. రూ.వందల కోట్లతో నగరం రూపురేఖలు మార్చేసినట్లు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.14.58 కోట్లతో ప్రతి డివిజన్‌లో చిన్నపాటి సమస్యలను తీర్చేలా రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లోనూ మరింత అభివృద్ధి చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ పాలకవర్గం ఏర్పాటైన అనతి కాలంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధి పరుగులు పెట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నగరం నలుదిక్కులా విశాలమైన రహదారులు నిర్మించామన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జ్, గుత్తి రోడ్డు, శ్రీకంఠం సర్కిల్ నుంచి గుత్తి రోడ్డు, ఎన్‌టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో రహదారులు విస్తరించినట్లు తెలిపారు. అనంతరం ఫెర్రర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే స్థానికులతో మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, కార్పొరేటర్లు లక్ష్మిదేవి, సైఫుల్లాబేగ్, చంద్రలేఖ, ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట మేరకే ఇంటింటికీ కుళాయి

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: మండల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారమే ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయించి, శాశ్వత నీటి సమస్య పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పీఏబీఆర్ డ్యాం నుంచి తుంగభద్ర జలాలను ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తెచ్చేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఉన్నా ఏనాడూ ఆత్మకూరు మండల నీటి సమస్యను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెన్నేకొత్తపల్లి మండలానికి వచ్చిన సందర్భంలో సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. పీఏబీఆర్ నుంచి అనంతపురం రూరల్ మండలం పాపంపేట వరకు పైప్‌లైన్ నిర్మాణానికి రెండు ప్యాకేజీల కింద రూ.95 కోట్లు మంజూరయినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కొళాయి కూడా వేయిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన పైప్‌లైన్ నుంచి గ్రామాలకు వెళ్లే పైప్‌లైన్ పనులను స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు దగ్గరుండి పరిశీలించాలన్నారు. పనులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు..

ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలు,కులమతాలకతీతంగా అర్హులందరికీ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం అందజేసిన పథకాలపైన, ప్రజలకు చేకూరిన లబ్ధి గురించి ప్రతి ఇంటికీ వెళ్లి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తెలియజేసినట్లు తెలిపారు. గతంలో ఏ నాయకుడు చేయని అభివృద్ధి జగనన్న నేతృత్వంలో నియోజకవర్గ అభివృద్ధి జరుగుతోందన్నారు. ప్రతి ఒక్కరం కష్టపడి మళ్లీ వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి



అలంకార సేవల్లో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీశివబాలయోగి ఆశ్రమంలో మంగళవారం పుష్యశుద్ధ షష్టి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుడు విశేష పూజలందుకున్నాడు. సంక్రాంతి పర్వదినాల్లో వచ్చిన సుబ్రహ్మణ్య షష్టి కావడంతో భక్తులు ఆలయాల్లో పోటెత్తారు. శ్రీవల్లి, దేవసేన సమేత సుహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పంచామృత సహితంగా కళశాభిషేకాలు, అర్చనలు, అలంకార సేవల అనంతరం భక్తులు స్వయంగా స్వామిని ఆలయ ప్రాంగణంలో పల్లకీలో ఊరేగించారు. భక్తిగీతాలు, కోలాటాలతో ఆలయం సందడిగా మారింది. మధ్యాహ్నం ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో తీర్థ, అన్నప్రసాద వితరణ చేశారు.

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న ఓటీపీఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్

అనంతపురం సెంట్రల్: రహదారి నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉన్నప్పుడే ప్రమాదాలను అరికట్టవచ్చని జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంలో డ్రైవర్లు కీలకపాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా అతివేగంగా బస్సులు నడపరాదన్నారు. బ్లాక్‌స్పాట్లపైనా అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణం సాధ్యమనే నమ్మకాన్ని ప్రయాణికుల్లో కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ సీటీఎం రమేష్, డిపో మేనేజర్ నాగభూపాల్, త్రీటౌన్ ఎస్ఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ప్రజలు సోమవారం మకర సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వ హించారు. ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభంలో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా రైతన్నలు పశువులకు పూజలు చేశారు. పలు గ్రామాల్లో మహిళలు ఇంటి ముందు రంగవల్లులు గొబ్బిళ్లలతో ముగ్గులు వేసి సాయంత్రం ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.



రెచ్చి పోతున్న బైక్ రైడర్స్

- రోజుకో చోట ప్రమాదాలకు కారణమవుతున్న వైనం
- ఫలించని పోలీసుల వ్యూహం



ట్రాఫిక్‌లో యువతకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



అనంతపురం క్రైం: నగరంలో బైక్ రైడర్స్ రెచ్చి పోతున్నారు. రహదారులపై తారా జువ్వాల్లా వాహనాలను నడుపుతూ తోటి వాహనదారులను భయాందోళనకు గురిచేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో సైతం ముందు చక్రం పైకి లేపి బైకులు నడుపుతూ ప్రమాదాలకు కారణ మవుతున్నారు. నగర శివారు ప్రాంతాల్లోని జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై వీరి ఆగడాలకు అంతులేకుండా పోతోంది.

నగరంలోని టీవీ టవరు, గుత్తిరోడ్డు నుంచి సోములదొడ్డి ప్రధాన రహదారి, నగర శివారులోని ఎస్కేయూ రోడ్డు, 44వ జాతీయ రహదారి, హైదరాబాద్ చెఫ్, లక్కీనైన్ హోటల్ ప్రాంతాల్లో బైక్ రైడర్లు పెద్ద తలనొప్పిగా మారారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రెండు ఇంటర్ కళాశాలల వద్ద మైనర్లు బైకలతో రోడ్లపై చక్కర్లు కొడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అటు వైపు వెళ్లాలంటేనే జనం జడుస్తున్నారు. యువత రహదారులపైకొచ్చి ద్విచక్ర వాహనాలు వేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఫలితంగా పదుల సంఖ్యలో ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోగా, చాలా మంది గాయాలతో మంచానికి పరిమితమయ్యారు.

- డిసెంబరు 24న స్థానిక కేఎస్ఆర్ కళాశాల వద్ద 65 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలిని ఏపీ39 జీఎఫ్ 4575 నంబరుగల బైక్ ఢీకొనింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమె మృతి చెందింది. బైక్‌ని ఇష్టారాజ్యంగా నడిపిన కారణంగానే వృద్ధురాలు చనిపోయినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.
- ఇటీవల శింగనమల నియోజక వర్గంలోని నార్పల మండల కేంద్రానికి చెందిన నలుగురు విద్యార్థులు ఒకే ద్విచక్ర వాహనంపై ట్యూషన్‌కు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ముగ్గురు మృతి చెందగా, ఒకరు తీవ్ర గాయాలతో నేటికి చికిత్స పొందుతున్నాడు.
- జిల్లా వ్యాప్తంగా మైనర్లు వాహనాలు నడపకుండా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల పాటు జిల్లాలో మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేశారు. కాగా సిబ్బంది కొరత కారణంగా నగరంలో ర్యాష్ డ్రైవింగ్, రైడింగ్‌ని నిలువరించలేక పోతున్నట్లు తెలుస్తోంది.

బైక్ రైడర్స్‌పై కేసులు నమోదు చేశాం:

నగరంలో ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామని ట్రాఫిక్ సీఐ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్, మైనర్లు, రైడింగ్ చేస్తూ తలనొప్పిగా మారిన వారిని గుర్తించి, నంబరు ప్లేట్ ఆధారంగా చిరునామా గుర్తించి స్టేషన్‌కు పిలిపించామన్నారు. నగరంలో సీసీ కెమెరాల ద్వారా వీరి కదలికలను గుర్తిస్తున్నామన్నారు. పోలీసులు లేరని ట్రాఫిక్‌లో అడ్డదిడ్డంగా వాహనాలు నడిపే వారిపై తమకు ఫిర్యాదు చేయాలని నగర వాసులను ఆయన కోరారు. తాజాగా నగరంలోని లక్ష్మీనగరుకు చెందిన ఇద్దరు అన్నదమ్ములను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశామన్నారు. వారి వాహనాలను సీజ్ చేయించి, ఆర్టీఓ ద్వారా చెక్‌లిస్ట్ ఇచ్చి పంపామన్నారు. గుత్తిరోడ్డు, తపోవనం కూడలిలో ద్విచక్ర వాహనాలు ర్యాష్‌గా నడుపుతున్నట్లు వచ్చిన రెండు ఫిర్యాదులపై కూడా స్పందించామన్నారు. ట్రాఫిక్‌లో ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ పాదాచారులకు, తోటి వాహనదారులకు తలనొప్పిగా మారితే ఏ ఒక్కరినీ వదిలేదిలేదన్నారు.